

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-అరకులోయ: అల్లూరి సీతారామరాజు పబ్లిక్ స్కూల్‌లో మాదక ద్రవ్య రహిత భారతదేశంను రూపొందించడంలో భాగంగా బుధవారం విద్యార్థులు మాదక ద్రవ్య రహిత భారతదేశాన్ని నిర్మించడానికి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాల దుష్ప్రభావాలను స్కూల్ అకడమిక్ డీన్ జి.వి.నరసయ్య విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరాజు, పి.ఆర్.ఓబీ పి.వి.ఎస్.యన్. ఆర్.వర్మ, ఏవో సుమంత్ రాజు, తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రిన్సిపాల్

ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలి

-సిఐటియు ఆధ్వర్యాన ఆందోళన

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలు నేపథ్యంలో ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌బి పోతురాజు కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కించుమండలో బుధవారం ఆటో డ్రైవర్లు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,మహిళలకు ఉచిత బస్సు పథకం ఆటో డ్రైవర్ల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. తమ సొంత పెట్టుబడితో ఫైనాన్స్ తీసుకుని ఆటోలు నడుపుకుంటూ కుటుంబ జీవనం సాగిస్తున్న ఆటో డ్రైవర్ల కుటుంబాలు వీధిన పడతాయన్నారు. కూటమి ప్రభుత్వం తక్షణమే పునరాలోచించి ఆటో డ్రైవర్ల కుటుంబాలను సంవత్సరానికి రూ 25 వేలు ఆర్థిక సాయం చేయాలని, ఆటో కొనుగోలుకు సబ్సిడీ రుణం ఇచ్చి, ఆర్థికంగా ఆదుకోవాలన్నారు. డీజిల్, పెట్రోల్ ధరలను తగ్గించాలన్నారు.ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంతో ఆటో కార్మికులు జీవనోపాధి దెబ్బతింటుందని, ప్రభుత్వం వారిని ఆర్థికంగా ఆదుకోవాలని సిఐటియు అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి వి ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం ఆటో కార్మికులతో కలిసి అరకులోయ నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద నిరసన చేపట్టారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, పట్టణాలు, గ్రామాల్లో ఆటో రిక్షా డ్రైవర్ల జీవనోపాధి తీవ్రంగా దెబ్బతింటుందన్నారు. ఆటో కార్మికుల ఆదాయం తగ్గిపోతుందన్నారు. ఇప్పటికే పలు భారాలతో జీవనం సాగిస్తున్న ఆటో కార్మికులు ఆర్థికంగా కుదేలయ్యే పరిస్థితి వస్తుందన్నారు.ఆటో రిక్షా కార్మికులకు ప్రత్యేక ఆర్థిక సాయాన్ని ప్రకటించాలని, రుణ సబ్సిడీ, ఇంధన సబ్సిడీ, వాహన బీమా సబ్సిడీ వంటి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించకపోతే, ఆందోళనలను మరింత ఉధృతం చేయాల్సి వస్తుందని ప్రభుత్వానికి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షులు శంకర్రావు, ఉపాధ్యక్షులు శ్రీను,రాము, ఆనంద్, గిన్నె, కోగేశ్వరరావు, సిపిఎం మండల కార్యదర్శి కె.రామారావు పాల్గొన్నారు.



అరకులోయలో ఆందోళన చేస్తున్న ఉమామహేశ్వరరావు, ఆటో కార్మికులు

అనంతగిరి: ఆటో డ్రైవర్లకు జీవన భృతి రూ.25000 వేలు ఇవ్వాలని సిఐటియు ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఆటో డ్రైవర్లు బుధవారం బొర్రా జంక్షన్, ములియగుడ సిఐటియు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి కిల్లో మోస్య మాట్లాడుతూ, ఫ్రీ బస్సు పథకం ప్రారంభం చేస్తున్న నేపథ్యంలో ఆటో డ్రైవర్ల పై తీవ్ర ప్రభావం చూపుతోందని, వారిని ఆదుకోవాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు కొండలరావు, తులసిరాం, సోమేష్, బాలరాజు, గిరిజన సంఘం మండల నాయకులు గెమ్మెల. దేవన్న, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



డుంబ్రిగుడలో నిరసన తెలుపుతున్న ఆటో కార్మికులు



అనంతగిరిలో నిరసన తెలుపుతున్న ఆటో కార్మికులు

ప్రయివేట్ విద్యా సంస్థల్లో మిగుల సీట్లకు దరఖాస్తులు

ప్రజాశక్తి పాడేరు, : విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేటు పాఠశాలలో పేద ప్రతికూల పరిస్థితులలో ఉన్న పిల్లలకు ఒకటో తరగతి లో 25 శాతం సీట్లు కేటాయింపు పై అయిదేళ్ళు నిండిన పిల్లలు అడ్మిషన్ పొందారని, ఇంకా మిగిలిన సీట్లకు గాను దరఖాస్తులను స్వీకరించుటకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని అల్లూరి జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ అధికారి వి.ఏ.స్వామి నాయుడు బుధవారం స్థానిక విలేకరులకు తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరంలో అన్ని ప్రైవేట్, అన్ అయిడేడ్ పాఠశాలకు ఇది వర్తిస్తుందన్నారు. అయిదేళ్ళు నిండిన పిల్లలు ఈ నెల 20వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 2025 మార్చి 31 నాటికి అయిదేళ్ళు పూర్తి అయ్యి ఉండాలని తెలిపారు.

ఏజెన్సీ స్పెషల్ డిఎస్‌సి, జిఒ3కి చట్టబద్ధతపై..

ముఖ్యమంత్రి హామీని నిలబెట్టుకోవాలి

-హైడ్రో పవర్ ప్రాజెక్ట్ ఒప్పందాలు రద్దు చేయాలి- ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేంద్ర

ప్రజాశక్తి- పెదబయలు: జీవో నెంబర్ 3కు చట్టబద్ధత, ఏజెన్సీ స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికలకు ముందు అరకు బహిరంగ సభలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర డిమాండ్ చేశారు. వీటితో పాటు హైడ్రో పవర్ ప్రాజెక్ట్ ఒప్పందాలు రద్దు చేసిన తర్వాతే టిడిపి కూటమి నాయకులు సూపర్ సిక్స్ సూపర్ హిట్ సంబరాలు చేసుకోవాలన్నారు. పెదబయలులో బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఈనెల 9న పాడేరులో జరిగిన ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి ప్రధానమైన ఏజెన్సీ స్పెషల్ డీఎస్సీ, జివో నంబర్ 3 చట్టబద్ధత, హైడ్రో పవర్ ప్రాజెక్ట్ ఒప్పందాలు రద్దు వంటి వాటిపై ఎటువంటి ప్రకటన చేయకపోవడం దారుణమన్నారు. ఏజెన్సీలో పండే కాఫీ పంటకు మాత్రం టాటా తదితర బడా కంపెనీలకు తలుపులు తెరిచి ఆదివాసీ రైతులను నట్టేట ముంచే ప్రకటన చేశారని పేర్కొన్నారు. ఏజెన్సీ ఆర్గానిక్ కాఫీ పంటను టాటా, నాంది తదితర బడా సంస్థలకు అప్పగించే ప్రయత్నాన్ని విరమించాలని, కాఫీ రైతులకు బకాయి డబ్బులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీలో హోం స్టే టూరిజం అమలు చేస్తే ఆదివాసీ సంస్కృతి నాశనమవుతుందని, 1/70 చట్టం ఉల్లంఘనకు గురవుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం ఆదివాసీ వ్యతిరేక విధానాలను విరమించుకోవాలని కోరారు.

పెదబయలు మండలంలో అన్నదాత సుఖీభవ డబ్బులు 1800 మంది లబ్ధిదారులకు జమ కాలేదని, అరకొరగా డబ్బులిచ్చి సంబరాలు చేసుకోవడం సిగ్గు చేటన్నారు. డబ్బులు పడని లబ్ధిదారులు సచివాలయానికి వెళ్లి అడిగితే ఎక్కువ భూమి ఉన్నా కూడా పడదంటున్నారని తెలిపారు. ఆధార్ సీడింగ్ చేసుకొని వీఆర్వో దగ్గరికి



మాట్లాడుతున్న సురేంద్ర

తీసుకెళ్లాలని చెబుతున్నారని, కాని విఆర్ఒలు అందుబాటులో లేకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. పట్టాలు డివైడ్ చేయాలని లబ్ధిదారులు రెవెన్యూ సదస్సులో వినతి పత్రాలు ఇచ్చినా ఇప్పటివరకు పరిష్కారం చేయకపోవడంతో అన్నదాత సుఖీభవ చాలామంది అర్హులు లబ్ధి పొందలేకపోతున్నారని, రెవెన్యూ సిబ్బంది వెంటనే సమస్య పరిష్కారం చేయాలని కోరారు. లేకుంటే లబ్ధిదారులతో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కమిటీ సభ్యులు బొండా గంగాధరం, జంపరంగి సునీల్ కుమార్, చెండా రామారావు, మండల కమిటీ సభ్యులు కొర్ర నర్సయ్య పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై ఆందోళన

-స్పెషల్ ఆఫీసర్ వాహనం అడ్డగింత



ఖాళీ బిందెలతో ఆందోళన చేపడుతున్న మహిళలు

ప్రజాశక్తి హుకుంపేట: మండలంలోని హుకుంపేట మేజర్ పంచాయతీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఆదివాసి మహిళ సంఘం ఆధ్వర్యంలో మహిళలు ఖాళీ బిందెలతో స్థానిక గిరిజన సంఘం కార్యాలయం నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు బుధవారం ర్యాలీ చేపట్టారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద మండల స్పెషల్ ఆఫీసర్ కే.పి. చంద్రశేఖర్ కి వాహనాన్ని అడ్డుకొని కార్యాలయం బయట నేలపై కూర్చుని అందోళన చేపట్టారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఆదివాసి మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ఎస్ హైమావతి, మండల కార్యదర్శి కే అరుణ అందజేశారు. ఈ సందర్భంగా హైమావతి, అరుణ మాట్లాడుతూ, సీపీఎం కాలనీ, మొదమాంబ కోలని, నిలాగడ్డ ప్రాంతాలకు నీటి సరఫరా తక్షణం ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కొన్ని కాలనీల్లో కుళాయి లేకపోవడంతో ప్రజలు ఇతరుల ఇంటి బోరుల దగ్గర నీళ్లు అడిగి తాగాల్సి వస్తోందన్నారు. ఐసిడిఎస్ శాఖ కారాలయం వెనకన ఉన్న అపరిశుభ్రమైన బావి నీటిని తాగాల్సి వస్తుందన్నారు. దీంతో, ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో తాగునీటి కష్టాలు తీర్చాలని ఎంపీడీవోకు మెమోరాండం అందించగా కనీసం స్పందించలేదన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల కార్యదర్శి టి.కృష్ణారావు, మణి, నీలమ్మ, సుందరమ్మ, పద్మ, పంతులమ్మ, గౌరి, కీర్తన, మంజుల, సుజాత, శైలజ, తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసిత కాలనీలో కనీస వసతులు కల్పించాలి

సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మాల్యాద్రి డిమాండ్

పజాశక్తి - ఎటపాక : పోలవరం కోసం సర్వస్వాన్ని త్యాగం చేసి పునరావాస కాలనీలకు తరలిన ప్రజలకు కనీస సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వాటిని తక్షణమే పరిష్కరించాలని సిపిఎం రాష్ట్ర కమిటి సభ్యులు మాల్యాద్రి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రంపచోడవరం జిల్లా కమిటి సభ్యులు ఐవితో కలసి బుధవారం పోలవరం నిర్వాసిత కాలనీలు నర్సింగపేట, రాయనపేట, కన్నాయిగూడెం కాలనీల్లో పలు సమస్యలపై సర్వే చేశారు. ఈ సందర్భంగా అక్కడ ఉంటున్న నిర్వాసితులతో మాట్లాడారు. నాసిరకంగా ఇళ్ల నిర్మించారని, రోడ్లు , డ్రైనేజీలు , వీధిలైట్లు లేవని, మంచినీటి సదుపాయం లేదని, మినరల్ వాటర్ తాగాల్సి వస్తోందని దాని కోసం నెలకు రూ.600 ఖర్చు చేయాల్సి వస్తోందని వారు వాపోయారు. జాబ్‌కార్డు ఓటర్ కార్డు ఆధార్ కార్డులన్నీ పాత గ్రామ పేరుతో ఉన్నాయన్నారు. పెన్షన్, రేషన్ కోసం స్వగ్రామానికి 70 కిలోమీటర్ల దూరం వెళ్ళాల్సి వస్తోందని తెలిపారు. స్కూలు, అంగన్వాడి భవనాలు, కమ్యూనిటీ హాలు నిర్మాణం ఇంకా పూర్తి కాలేదని తెలిపారు. మాల్యాద్రి మాట్లాడుతూ పోలవరం నిర్వాసితుల పక్షాన సిపిఎం నిరంతరం పోరాడుతూనే ఉందని స్పష్టం చేశారు. ఈనెల 16, 17న పోలవరం నిర్వాసిత కాలనీలో సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ, సిపిఎం రాజ్యసభ సభ్యులు జాన్‌బ్రిటాస్ పర్యటిస్తున్నారని, సమస్యల పరిష్కారం కోసం వారి పర్యటనను జయప్రదం చేయాలని మాల్యాద్రి కోరారు.



నిర్వాసితులతో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మాల్యాద్రి

పొంగుతున్న వాగులు, గెడ్డలు



కొయ్యూరులో గెడ్డ ఉధృతికి నిలిచిన రాకపోకలు



గింజర్తి వాగు వద్ద పోలీసు బందోబస్తు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జడ్డంగి, మడేరువాగు, ఒట్టిగడ్డ, కింద్ర పెద్దేరు, తంటికొండ, వాతంగి వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. బుధవారం భారీ వర్షం కురవడంతో రాజఒమ్మంగి గ్రామశివారు ఒట్టిగడ్డ వాగు, నెల్లిమెట్ల వాగు, వాతంగి శివారువాగు, గింజర్తి వాగులు పొంగి ప్రవహించి బ్రిడ్జిల మీద నుంచి వరదనీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి.

కొయ్యూరు : మండలంలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని మండల కేంద్రానికి ఆనుకుని ఉన్న వాగులు, గెడ్డలు ఉధృతంగా ప్రవహిస్తుండడతో మండల కేంద్రానికి రాకపోకలు చేసేందుకు పలువురు ఇబ్బంది పడ్డారు. బుధవారం భారీవర్షం కురవడంతో మారుమూల గ్రామస్తులకు మండల కేంద్రం వచ్చేందుకు ఇబ్బందులు పడ్డారు. రోడ్డుపై నీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి.

వాగులు దాటవద్దు

రాజవొమ్మంగి: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని శాంతినగర్ వట్టిగడ్డ వాగు నిల్లిమెట్ల గింజర్తి వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఎవరూ వాగులు దాటవద్దని ఎస్ఐ నరసింహమూర్తి బుధవారం హెచ్చరించారు. ఆయా వాగులు బ్రిడ్జిల వద్ద ఎవరు వెళ్లకుండా బందోబస్తును ఏర్పాటు చేశారు. ప్రజలు సాహసం చేసి వాగులు దాటారంటే ప్రమాదమని ప్రాణాల మీదకు కొని తెచ్చుకునే వారు అవుతారని హెచ్చరించారు. అత్యవసరమైతే తమకు ఫోన్ ద్వారా సమాచారం అందజేయాలని సహాయక చర్యలు చేపట్టేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



వాహనదారులను కౌన్సెలింగ్ ఇస్తున్న సిఐ వరప్రసాద్

విధిగా హెల్మెట్ ధరించాలి

ప్రజాశక్తి - జికె వీధి : మండల కేంద్రంలో హెల్మెట్ ధరించని వాళ్లని పోలీస్ శాఖ నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా 70-80 మందిని, పోలీస్‌స్టేషన్‌కి తీసుకుని వచ్చి ఈ మధ్య జరుగుతున్నటువంటి ప్రమాదంలో ఎలా ప్రాణాలు కోల్పోతున్నారు అనే దానిమీద కౌన్సిలింగ్ ఇచ్చినట్టు జికె వీధి సర్కిల్ ఇన్స్పెక్టర్ వరప్రసాద్ అన్నారు. ప్రతి ఒక్కరు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. ఎవరికి ఫైన్ విధించకుండా అందరికీ పరివర్తన వచ్చేటట్టుగా అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఇకపై నుండి హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

రాజవొమ్మంగి: ప్రతి ద్విచక్రవాహనదారుడు విధిగా హెల్మెట్ ధరించాలని జడ్డంగి ఎస్ఐ చినబాబు తెలిపారు. బుధవారం జడ్డంగి సెంటర్‌లో సిబ్బందితో కలసి రహదారి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రమాదాల నివారణ,ట్రాఫిక్ నియమాల ప్రాముఖ్యత, మోటార్ వాహన చట్టాలు,హెల్మెట్ ధరించడం అవసరం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించిన వారికి గులాబీ పువ్వులు అందజేశారు.



అవార్డు అందుకున్న ఎంపిడిఒ శ్రీనివాస విశ్వనాథ్

ఉత్తమ ఎంపిడిఒగా శ్రీనివాస విశ్వనాథ్

ప్రజాశక్తి -మారేడుమిల్లి : మారేడుమిల్లి మండలం ఏజెన్సీ గిరిజన ప్రాంతంలో గిరిజనుల కోసం విద్య, వైద్యం, ఆరోగ్యం, పౌష్టికాహారం, వ్యవసాయం, ఆర్థిక సుస్థిరత తదితర అంశాలలో విశేష సేవలందించిన మారేడుమిల్లి ఎంపిడిఒ తూతిక శ్రీనివాస విశ్వనాథ్‌ను జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ ప్రశంసపత్రం, మెడల్ అందించి సత్కరించారు. పాడేరు కలెక్టర్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సంపూర్ణత అభయాన్ సమ్మాన్ సమరహో కార్యక్రమంలో ఎంపిడిఒకు జిల్లా అధికారుల సమక్షంలో పురస్కారం అందించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఇద్దరు మృతి

ప్రజాశక్తి-రంపచోడవరం: రంపచోడవరం మండలం భూపతిపాలెం వద్ద జరిగిన బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు సంఘటన స్థలంలోనే మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బుధవారం తెల్లవారుజామున తొండంగి మండలం పెరుమళ్ళపురం, రామపురం గ్రామానికి చెందిన వాసలా దేవుడు, గంగరి వీరబాబు బైక్‌పై భద్రాచలం వెళ్తుండగా రంపచోడవరం మండలంలోని భూపతిపాలెం రిజర్వాయర్ సమీపానికి వచ్చేసరికి గుర్తు తెలియని వాహనం వీరి వాహనాన్ని ఢీకొనడంతో వారిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. రంపచోడవరం సిఐ సన్యాసినాయుడు సంఘటనా స్థలాన్ని చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.



జమాల్‌ఖాన్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే శిరీష తదితరులు

మండల పార్టీ అధ్యక్షునిగా జమాల్‌ఖాన్

ప్రజాశక్తి - చింతూరు : పార్టీలో కష్టపడ్డ ప్రతీ కార్యకర్తకి సముచిత స్థానం ఉంటుందని రంపచోడవరం ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ ఛైర్మన్ శిరీషదేవి అన్నారు. మండలంలో టిడిపి కార్యాలయంలో నియోజకవర్గం పార్టీ పరిశీలకులు కొల్లుబోయిన శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక సంస్థాగత ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిరీష మాట్లాడుతూ పార్టీలో విభేదాలు లేకుండా అభివృద్ధి, సంక్షేమాన్ని అందిపుచ్చుకోవాలని దానికి సమర్ధ నాయకత్వం అవసరం అన్నారు. అనంతరం నిర్వహించిన చింతూరు మండలపార్టీ అధ్యక్ష ఎన్నికల కార్యక్రమంలో జమాల్‌ఖాన్‌ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నియోజకవర్గం పరిశీలకులు కొల్లుబోయిన శ్రీనివాస్‌యాదవ్ జమాల్‌ఖాన్ ఎన్నికను ఆమోదించినట్లు తెలిపారు. ఎన్నికైన జమాల్‌ఖాన్‌ని శాలువాతో సత్కరించారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని జమాల్‌ఖాన్ తెలిపారు. నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు విజయ్‌భాస్కర్, చింతూరు మాజీ మండలపార్టీ అధ్యక్షులు చిన్నారెడ్డి పాల్గొన్నారు.



కోడి పిల్లలను పంపిణీ చేస్తున్న డాక్టర్ షరీఫ్

నాటు కోళ్ల పెంపకంతో ఆర్థికాభివృద్ధి

ప్రజాశక్తి -మారేడుమిల్లి: నాటుకోళ్ల పెంపకంతో ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని అలాగే వాటి గుడ్లు, మాంసం తినడం వల్ల ఆరోగ్యం కరంగా ఉండవచ్చని పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ షరీఫ్ అన్నారు. మారేడుమిల్లి మండలం సున్నంపాడులో పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ షరీఫ్ హిఫర్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ గణేష్, నవజీవన్ ఆర్గనైజేషన్ బిజినెస్ డెవలప్మెంట్ ఆఫీసర్ నాగేశ్వరరావు చేతుల మీదుగా ఎఫ్‌ఐజి గ్రూపు రైతులకు ఆసిల్ కోడి పిల్లలు పంపిణీ చేశారు. డిడి షరీఫ్ మాట్లాడుతూ పశుసంవర్ధక శాఖ తరపున ఎలాంటి సహకారం కావాలన్నా అందిస్తామన్నారు. డాక్టర్ గణేష్ మాట్లాడుతూ ఫేజ్ 2లో భాగంగా రంపచోడవరం మండలంలో 129 మంది రైతులకు, మారేడుమిల్లి మండలంలో 124 మంది రైతులకుకోడి పిల్లలు పంపిణీ చేశామన్నారు. ఫేజ్ 3లో గంగవరం, వై.రామవరం, అడ్డతీగల మండలాలకు ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌పిఒ సెక్రెటరీ కురసం బాపన్న దొర, నవజీవన్ ఆర్గనైజేషన్ సిబ్బంది బాబురావు తదితరులు పాల్గొన్నారు.

జెండా పండగ ఘనంగా నిర్వహించేందుకు చర్యలు

ప్రజాశక్తి-రంపచోడవరం : స్వాతంత్ర్య దినోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు తగు చర్యలు చేపడుతున్నామని రంపచోడవరం ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం పేర్కొన్నారు. బుధవారం అధికారులతో మాట్లాడుతూ ఆగస్టు 15న స్థానిక జూనియర్ కళాశాలలో జాతీయ పతాక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఉదయం 8.55 నిమిషాలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని సిబ్బంది తప్పకుండా హాజరు కావాలని సూచించారు.

అపరిశుభ్ర రహదారితో అవస్థలు


ఇరువైపులా చెత్తాచెదారంతో అధ్వానంగా ఉన్న గుంటసీమ రోడ్డు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:గుంటసీమ రోడ్డులో నడవాలంటే ముక్కు మూసుకొని నడవలిసిన పరిస్థితి ఏర్పడుతుంది. దీంతో అటుపక్క నడిచి వెళ్లే వారు పలు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలోని గుంటసీమ రోడ్డు ఆటో స్టాండ్ పై ప్లాస్టిక్ వ్యర్థాల చెత్తచెదారం పడేసి ఉండటంతో ఆ రోడ్డు అపరిశుభ్రంగా దర్శనమిస్తుంది. ఆ రోడ్డు గుండా వెళ్లే వాహనదారులు, పాదచారులు పలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డు వెంట నిత్యం జూనియర్ కళాశాల, ఆశ్రమ, గవర్నమెంట్ హై స్కూల్, విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందితో పాటు వివిధ అనారోగ్యాలతో బాధపడే వ్యాధిగ్రస్తులు సైతం ఆ రోడ్డు గుండా ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సందర్శించి వైద్య సేవలు చేయించు కుంటున్నారు. రోడ్డు పక్కనే చెత్తచెదారం పోగేసి ఉండడంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వర్షపు నీరు నిల్వ ఉండి దోమలు వ్యాప్తి చెంది దుర్వాసన వస్తుంది. దీంతో ఆ రోడ్డులో రాకపోకలు సాగించాలంటే ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఉద్యోగులు అంటున్నారు. తక్షణమే పంచాయతీ అధికారులు స్పందించి రోడ్డు పక్కన ఉన్న అపరిశుద్ధాన్ని తొలగించాలని పలువురు కోరుతున్నారు.

ఏకలవ్య పాఠశాలకు భూమిలిచ్చిన
రైతులకు ఉపాధి కల్పించాలి


వినతి పత్రం అందజేస్తున్న రైతులు, నేతలు.

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: అరకులోయ మండలం బొండం పంచాయితీ మజ్జివలస ఏకలవ్య పాఠశాల నిర్మాణానికి భూమిలిచ్చిన రైతులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో రైతులు మంగళవారం జిల్లా ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ కు వినతి పత్రాన్ని అందజేశారు.భూ సేకరణ చట్ట ప్రకారం భూములు కోల్పోయిన రైతులను నష్టపరిహారం, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఏకలవ్య పాఠశాల నిర్మాణానికి సుమారు 16 మంది రైతులు 18.5 ఎకరాలు భూమిని కేటాయించారన్నారు. జీడీ మొక్కలు పెంచి వాటి ద్వారా వచ్చే ఫలాశయం ఆదాయంతో ఆ భూములను నమ్ముకొని జీవనం సాగించేవారన్నారు. ఆ భూములను 2020-21 సంవత్సరంలో ఏకలవ్య పాఠశాల నిర్మాణానికి భూ సేకరణ నిమిత్తం వచ్చిన అధికారులు రైతులకు ఉపాధి కల్పిస్తామని నమ్మించి రైతులను సంతకాలు పెట్టించుకొని పాఠశాల నిర్మాణానికి తీర్మానం చేయించుకున్నారన్నారు. ఇప్పుడుకి సుమారు ఆరేళ్ల కావస్తున్నా భూములు ఇచ్చిన రైతులకు ఎటువంటి ఉపాధి అవకాశాలు కల్పించలేదన్నారు. భూములు నష్టపోయిన రైతులకు ఉపాధి అవకాశాలు కల్పించకుండా ఇతర వ్యక్తుల పేర్లను పొందపర్చడం సరికాదన్నారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం ఉపాధ్యాయ అవకాశాలు కల్పించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి గత్తుం బుజ్జి బాబు, నాయకులు కె రామారావు, రైతులు జి.పరశు రామ్, ఎం.ఇందోర్, ధనుంజయ్, సుంక్రి, పి.బుద్దు, జి.ఆదిమూర్తి, ఎస్ అప్పన్న, జి బుధ్ర, ఎస్.దొన్ను, జి.అప్పలమ్మ, జి.కేసోబ్, ఎం.దొంబు, తదితరులు పాల్గొన్నారు.

సేంద్రీయ వ్యవసాయానికి సహకారం
జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: గిరిజన ప్రాంతంలో సాగు చేస్తున్న గిరిజన సేంద్రీయ వ్యవసాయ ఉత్పత్తులను ప్రోత్సహిస్తామని, ఈ సాగుకు సహకారం అందిస్తామని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ స్పష్టం చేసారు. బుధవారం స్థానిక కాఫీ హౌస్లో ఆకాంక్ష జిల్లాలో భాగంగా నీతి ఆయోగ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సేంద్రీయ ఉత్పత్తుల ప్రదర్శన విక్రయాల ప్రదర్శనను జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సేంద్రీయ ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయాలు ఈనెల 19వ తేదీ వరకు నిర్వహిస్తారని పేర్కొన్నారు. మార్కెటింగ్ సౌకర్యం కల్పనకు చర్యలు చేపడతామని అన్నారు. తాజా కూరగాయలను మార్కెట్కు తరలిస్తే మంచి లాభాలు వస్తాయన్నారు. సీజనల్ ఉత్పత్తులను పండించాలని రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు సూచించారు. జాయింట్ కలెక్టర్ ఎం. జె. అభిషేక్ గౌడ మాట్లాడుతూ గిరిజన ఉత్పత్తులకు నీతి ఆయోగ్ ఆధర్యంలో ఏర్పాటు చేస్తున్న ప్రదర్శన విక్రయాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఎన్.బి. ఎస్ నంద్, జెడ్ బి ఎన్ ఎఫ్ డిపి ఎం భాస్కరరావు, నీతి ఆయోగ్ ప్రోగ్రాం అధికారి నారాయణ రెడ్డి పాల్గొన్నారు.

హర్ ఘర్ తిరంగా ర్యాలీ

ప్రజాశక్తి-పాడేరు:యువత దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ పిలుపునిచ్చారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన హర్ ఘర్ తిరంగా ర్యాలీని బుధవారం జిల్లా కలెక్టరేట్ ఆవరణలో జిల్లా కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రధాన మంత్రి, రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన మేరకు ప్రతి ఊరిలో, ప్రతి జిల్లాలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల రెండు వారాల పాటు జరుపుకోవాలని తెలిపారు. ఈ వేడుకల్లో జెండా పట్టుకుని తిరగడమే కాకుండా దేశభక్తిని చాటాలని సూచించారు. యువత దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ, సహాయ కలెక్టర్ కె.సాహిత్, డిఇఓ పి.బ్రహ్మాజీ, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.బి.ఎస్ నంద్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి విశ్వేశ్వర నాయుడు, డిఆర్డిఎ పిడి మురళీ, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి ఝాన్సీ రామ్ పడాల్ పాల్గొన్నారు.

అథ్లెట్లకు అభినందన

ప్రజాశక్తి-పాడేరు: బాపట్ల జిల్లా చీరాల వై ఎస్ ఆర్ కాలేజీ క్రీడా మైదానంలో జరిగిన జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో తలారిసింగ్ ఆశ్రమ పాఠశాల విద్యార్థులు జి.రామ్ చరణ్ ట్రైథ్లన్ విభాగంలో ద్వితీయ స్థానం సాధించాడు. జి. చంద్రశేఖర నాయుడు షాట్ పుట్ లో తృతీయ స్థానం సాధించి పాండిచ్చేరిలో జరిగే సౌత్ జోన్ జాతీయ అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొననున్నారు. పతకాలు సాధించిన గిరిజన విద్యార్థులు కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ ను కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ క్రీడాకారులను అభినందించారు. మరిన్ని పతకాలు సాధించి అల్లూరి సీతారామరాజు జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. వీరి విజయానికి కృషి చేసిన స్థానిక పాఠశాల వ్యాయామ సంచాలకులు పి. సింహాచలం, వ్యాయామ ఉపాధ్యాయులు గుల్లెల మన్మధరావులను ప్రశంసించారు.

ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-మధురవాడ : ర్యాగింగ్ వంటి విషసంస్కృతికి విద్యార్థులు దూరంగా ఉండాలని గీతం డీమ్స్ వర్సిటీ ప్రోవైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతంరావు పిలుపునిచ్చారు. బుధవారం గీతంలో ర్యాగింగ్‌పై అవగాహనకు నిర్వహించిన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ర్యాగింగ్ నిరోధానికి నిర్దేశించిన చట్టాలను విద్యార్థులకు వివరించారు.. కార్యక్రమంలో గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి డైరెక్టర్ ప్రొఫెసర్ కె.నాగేంద్రప్రసాద్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.వి.జి.రెడ్డి, గీతంలోని వివిధ విభాగాధిపతులు, ఎన్ఎస్ఎస్ పోగ్రామ్ ఆఫీసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. ర్యాగింగ్ వ్యతిరేక నినాదాలుతో ర్యాలీని నిర్వహించారు.

కాఫీ శుద్ధి కర్మాగారాన్ని తరలించొద్దు

జిల్లా కలెక్టర్‌కు ఎపి ఆదివాసీ గిరిజన సంఘం నేతల వినతి

ప్రజాశక్తి-చింతపల్లి : చింతపల్లిలోని కాఫీ శుద్ధి కర్మగారాన్ని తరలించవద్దని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు కలెక్టర్ దినేష్‌కుమార్‌కు విజ్ఞప్తి చేశారు. మండలంలోని గొందిపాకల గ్రామంలో అల్లూరి సీతారామరాజు అనుచరుడు బోనంగి పండు పడాల్ 135వ జయంతి సందర్భంగా జరిగిన అధికారిక కార్యాక్రమానికి విచ్చేసిన కలెక్టర్‌కు ఎపి ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్, కాపీ రైతు సంఘం నాయకులు బౌడు కుశలవుడు వినతిపత్రం అందజేశారు. అల్లూరి జిల్లాలో అంతర పంటగా ఉన్న కాఫీ చింతపల్లి, జీకే వీధి మండలాలలో వేల ఎకరాలలో ఐటీడీఏ పరిధిలో సాగు జరుగుతుందని, దీని ద్వారా గిరిజన కుటుంబాలు ఇప్పుడిప్పుడే ఆర్థికంగా ఎదుగుతున్నాయని తెలిపారు. అల్లూరు జిల్లాలో పరిశ్రమలు లేవని, గిరిజనులు సాగు చేస్తున్న కాఫీ, మిరియాలు, పసుపు, మొక్కజొన్న. చింతపండు, అడ్డాకులు వంటి వాటికి చిన్న తరహా పరిశ్రమలు నెలకొల్పి గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. వేలాది మంది గిరిజన యువతీ యువకులు ఉపాధి లేక ఎదురుచూస్తున్న తరుణంలో చింతపల్లిలో సుమారు రూ.10 కోట్లుతో నెలకొల్పిన కాఫీ శుద్ధి కర్మాగారం నర్సీపట్నం ప్రాంతానికి తరలిస్తున్నట్టు తెలియవచ్చిందని, ఇదే జరిగితే గిరిజనులకు తీవ్ర నష్టం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కాఫీ శుద్ధి కర్మాగారం తరలించే ఆలోచన విరమించుకోవాలని కోరారు. లేకుంటే చింతపల్లి మండలాన్ని అష్ట దిగ్బంధం చేయడానికి వెనుకాడబోమని హెచ్చరించారు. దీనికి స్పందించిన జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ మాట్లాడుతూ కాఫీ శుద్ధి కర్మాగారాన్ని ఇక్కడి నుంచి తరలించేది లేదని, అవసరమైతే ఇంకో రూ.10 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎపి ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పాంగి ధనుంజయ్, ఆదర్శ రైతు జనకని కనకారావు తదితరులు పాల్గొన్నారు.


కలెక్టర్‌కు విన్నవిస్తున్న గిరిజన సంఘం నేతలు

రైతు ఉత్పత్తిదారుల గ్రూపులు ఏర్పాటు చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి-పాడేరు: రైతు ఉత్పత్తిదారుల సంఘాలను గ్రూప్‌లుగా ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ఎఎస్.దినేష్ కుమార్ స్పష్టం చేసారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కాన్ఫరెన్సు మందిరంలో సంపూర్ణత అభియాన్ సమ్మాన్ సమారో ఆకాంక్ష కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, సంపూర్ణత అభియాన్ సమ్మాన్ సమారో కార్యక్రమానికి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ప్రవేశ పెట్టాయన్నారు. జిల్లాలో గంగవరం, మారేడుమిల్లి, వై.రామవరం మండలాలు గుర్తించడం జరిగిందన్నారు. ఇక్కడ ఉన్న సమస్యలు గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. రైతు ఉత్పత్తిదారుల ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. గిరిజనులకు గ్రూప్ గా ఏర్పాటు చేసి వారికి ఋణాలు అందజేయాలని సూచించారు. పాడేరు కాఫీ హౌస్ లో రైతు ఉత్పత్తులకు ప్రోత్సాహం కల్పించేందుకు 10 స్టాల్స్ లో రైతు ఉత్పత్తులను ఆకాంక్ష హర్ట్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.
జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ మాట్లాడుతూ, రాష్ట్రంలో 114 ఆకాంక్ష జిల్లాలుగా గుర్తించారని అందులో అల్లూరి సీతారామరాజు జిల్లా కూడా ఉందన్నారు. జిల్లాలో గుర్తించిన మండలాల్లో విద్యా, వైద్య, ఐసిడిఎస్, డిఆర్డిఎ శాఖలు, యంపిడిఓలు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మాజీ శాసన సభ్యులు గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత సంపూర్ణత అభియాన్ సమ్మాన్ సమారో కార్యక్రమనికి ప్రాధాన్యత నిచ్చిందన్నారు.ప్రతీ ఒక్కరూ అంకితం భావంతో పనిచేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నీతి అయోగ్ ప్రోగ్రాం అధికారి నారాయణ రెడ్డి పాల్గొన్నారు.

రేషన్ సరుకులు ఇవ్వకపోవడంపై విచారణ


విచారణ చేపడుతున్న అధికారులు

ప్రజాశక్తి- పెదబయలు:మండల కేంద్రం సీతగుంట పంచాయతీ పరిధిలోని జిసిసి 95 నెంబర్ డిపోలో రేషన్ సరుకులు లబ్ధిదారులకు, అంగన్వాడీ కేంద్రాలకు ఇవ్వకపోవడంపై బుధవారం సివిల్ సప్లై అధికారులు విచారణ చేపట్టారు. ఈ డిపోలో రేషన్ సరుకులు కార్డుదారులకు 12వ తేదీ వచ్చినా ఇవ్వకపోవడంపై మంగళవారం లబ్ధిదారులతో కలిసి ఎపి ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా మాజీ అధ్యక్షులు బొండా సన్నిబాబు, జంబూ దేవరాజు డిపో వద్ద నిరసన తెలిపిన విషయం విధితమే. దీనికి స్పందించిన స్పందించిన అల్లూరి జిల్లా సివిల్ సప్లై అధికారులు ప్రశాంత్, స్వామి బుధవారం విచారణ చేపట్టారు. గిరిజన సంఘం నేత బొండా సన్నిబాబుతో పాటు కొంతమంది లబ్ధిదారులు దీనికి హాజరై సరుకులు అందని విషయాన్ని తెలియజేశారు. సేల్స్‌మెన్ ఆనంద్ పొంతన లేని సమాధానాలు చెప్పడంతో అధికారులు ఆగ్రహానికి గురయ్యారు. సీతగుంట పంచాయతీ డిపో పరిధిలో 830 రేషన్ కార్డులుండగా 16 వేల కేజీల బియ్యం లబ్ధిదారులకు ఆగస్ట్ నెల 15 లోపు అందించాల్సి ఉంది. కానీ డిపోలో బియ్యం 38 బస్తాలు మాయం కావడంతో లబ్ధిదారులకు బియ్యం అందజేదు. అంగన్వాడీ కేంద్రాలకు పంపించాల్సిన బియ్యం 390 బస్తాల్లో 38 బస్తాలు బియ్యం లేవు. రికార్డుల నిర్వహణ సరిగా లేదని గుర్తించారు. మూడు నెలల నుండి బియ్యం, పంచదార, పప్పులు కార్డు లబ్ధిదారులకు అందటం లేదు. వాటిని దారి మళ్లిస్తున్నట్లు గుర్తించారు. నూతనంగా విధులు నిర్వర్తిస్తున్న గోదాము సూపర్ ఇండెంట్ వివరణకు అందుబాటులో లేరు. ఈ వ్యవహారంపై అధికారులు సమగ్ర విచారణ చేసి లబ్ధిదారులకు సరుకులు సక్రమంగా అందే విధంగా చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘం నేత సన్నిబాబు డిమాండ్ చేశారు.

నిర్వాసితుల సమస్యలను పార్లమెంట్‌కు తీసుకెళ్తాం

సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. బేబి, ఎంపీ జాన్‌బ్రిట్టాస్ పర్యటనను జయప్రదం చేయండి
సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సున్నం రాజులు

ప్రజాశక్తి-వి.ఆర్‌పురం: పోలవరం నిర్వాసితుల సమస్యలను ఢిల్లీ పార్లమెంట్ వరకు తీసుకు వెళ్లి సమస్యల పరిష్కారానికి సిపిఎం కృషి చేస్తుందని, నిర్వాసితుల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు ఈ నెల 16,17 తేదీల్లో సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్. ఎంఎ. బేబీ, రాజ్యసభ పక్షనేత ఎంపి జాన్‌బ్రిట్టాస్‌లు ముంపు మండలాల్లో పర్యటిస్తారని నిర్వాసితులందరూ ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిపియం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సున్నం రాజులు కోరారు. బుధవారం రేఖపల్లి పార్టీ కార్యాలయంలో పూనెం ప్రదీప్‌కుమార్ అధ్యక్షతన జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ నిర్వాసితుల సమస్యలను గుర్తించి పరిష్కారం చేయడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ప్రతి ఏడాది నిర్వాసితులు తీవ్రమైన సమస్యలను ఎదుర్కొంటూ ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని జీవనం సాగించుకునే పరిస్థితి ఎదుర్కొంటున్నారన్నారు. ఉంద్రావాస కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించడంలో నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తున్నాయని తెలిపారు. ఇకనుంచి నిర్వాసితుల సమస్యలను పార్లమెంట్‌లో చర్చిస్తుందని 16 17వ తేదీల్లో పార్టీ జాతీయ నాయకులు ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ ఎంపీ జాన్ బ్రిట్టస్ లు రానున్నారని నిర్వాసితులందరూ ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్, పార్టీ జిల్లా కమిటి సభ్యులు సోయం చినబాబు, కారం సుందరయ్య, బంకు సత్తిబాబు, కదల కొండారెడ్డి, వడ్లాది రమేష్ గుండెపుడి లక్ష్మణరావు, కమ్మ చిచ్చు సత్యనారాయణ, పులి బొజ్జి, కారం సత్తిబాబు ఖాదర్ పాల్గొన్నారు.




మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సున్నం రాజులు

బాల్యవివాహాలపై అవగాహన కల్పించండి


మాట్లాడుతున్న ఎంపిడిఒ యాదగిరేశ్వరరావు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: బాల్యవివాహాల వలన కలిగే నష్టాలు గుర్చి ప్రజలకు వివరించాలని ఎంపిడిఒ యాదగిరేశ్వరరావు, ఐసిడిఎస్ సిడిపిఒ సుజాత అన్నారు. బుధవారం ఎంపిడిఒ కార్యాలయంలో మహిళా పోలీస్ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. బాల్యవివాహాల వల్ల వచ్చే సమస్యలు గురించి గ్రామాల్లో అవగాహన కల్పించాలని ఈసందర్భంగా వారికి తెలిపారు. మహిళా పోలీసులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పలు సచివాలయాల్లో పనిచేస్తున్న మహిళా పోలీసులు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డాక్టర్ గంగులయ్యకు అభినందనలు


అభినందనలు తెలిపిన ఈశ్వరరావు

ప్రజాశక్తి -జికెవీధి: పాడేరు నియోజకవర్గం జనసేనపార్టీ ఇన్చార్జ్ డాక్టర్ వంపూరు గంగులయ్య రాష్ట్ర జానపదకళలు సృజనాత్మకత అకాడమీ చైర్మన్‌గా నియమితులైన సందర్భంగా గూడెం కొత్తవీధి మండలం సంకాడ పంచాయతీ జనసేన పార్టీ పంచాయతీ అధ్యక్షులు ఊలం ఈశ్వరరావు ఆయన స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి గ్రామకమిటీ, ప్రజలు తరపున అభినందనలు తెలియజేశారు. పార్టీ బలోపేతానికి అహర్నిశలు శ్రమించి కృషి చేస్తున్న మీరు మరెన్నో పదవులు చేపట్టాలని, కోరుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో డి.కోటిబాబు, జె.బాబురావు, వీరన్నపడాల్, ఎస్.రాజు పడాల్, వి.బాలు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎఒ వెంకటేశ్వర్లు

వరి సాగులో మెలకువలతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి - మారేడుమిల్లి: మండలంలో కొడవటిలంక, తాడేపల్లి గురమామిడి గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది, రైతు సదస్సులు నిర్వహించారు. మండల వ్యవసాయరశాఖాధికారి వెంకటేశ్వర్లు పాల్గొని రైతులకు వ్యవసాయ సూచనలు చేశారు. వరి, అపరాలు, చిరు ధాన్యాలు, పంటల బీమా పథకం, వ్యవసాయ యాంత్రీకరణ, ఈపంట నమోదు, పంట రుణాలు మొదలగు అంశాలను తెలియజేశారు. పశుసంవర్ధక శాఖ నుండి వెటర్నరీ అసిస్టెంట్ పశువుల యాజమాన్యం, టీకాలు, పశుభీమాపథకం గురించి తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, పీసా సభ్యులు పాల్గొన్నారు.

నెల్లిపూడి పాఠశాల ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - గంగవరం : డిఇఒ మల్లేశ్వరరావు సిహెచ్ నెల్లిపూడి పాఠశాలను బుధవారం తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు పరిశీలించారు. ఉపాధ్యాయులు విద్యార్థులు తప్పని సరిగా లీవ్, హాజరు ఆన్లైన్ హాజరు తప్పనిసరిగా వేయాలని సూచిం చారు. ఉపాధ్యాయుల యొక్క డైరీలు లెసన్ ప్లాన్స్ విద్యార్థుల యొక్క సామర్థ్యాలను పరిశీలించారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేకమైన శిక్షణ ఇవ్వాలని హెచ్ఎంను ఆదేశించారు.

ఉపాధి హామీ బిల్లులు చెల్లించాలి

ప్రజాశక్తి-విఆర్‌పురం: మండలంలోని రేకపల్లి గ్రామంలో వ్యవసాయ సంఘం నాయకుల సమావేశం బుధవారం జరిగింది సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు సోయం చిన్నబాబు మాట్లాడుతూ ఉపాధి పనులు చేసిన వారికి బిల్లులు రాక చాలా ఇబ్బంది పడుతున్నారని పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించాలని, జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. ఆరువారాల నగదు ఇంకా రాలేదని వాపోయారు. తక్షణమే పెండింగ్ బిల్లులు చెల్లించాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు కారం సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

మెరిట్ లిస్టులో అభ్యంతరాలను
19లోగా తెలియజేయాలి

ప్రజాశక్తి -పాడేరు : అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాల పాడేరు టైప్-4 కేజీబివి, అరకువేలీ మండలం కంటబంసుగూడ టైప్-4 కేజీబివిలో 2025-26 విద్యా సంవత్సరానికి గాను వార్డెన్, పార్ట్ టైమ్ పోస్టులను తాత్కాలిక గెస్ట్ ప్రాతిపదికన భర్తీ చేయుటకు ఇదివరకే దరఖాస్తులను ఆహ్వానించినట్లు సమగ్ర శిక్ష ఏపీసి స్వామి నాయుడు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించిన తాత్కాలిక మెరిట్ లిస్టును 13న అల్లూరి సీతారామరాజు జిల్లా, పాడేరు సమగ్ర శిక్ష కార్యాలయంలో అభ్యర్థుల పరిశీలనార్థం అందుబాటులో ఉంచడమైనదని తెలిపారు. టైపు-4 కేజీబివిలో వార్డెన్ పోస్టుకు దరఖాస్తు చేసిన అభ్యర్థులందరూ పాడేరు సమగ్ర శిక్షా కార్యాలయంలో తమ వివరాలను సరిచూసుకొని, అభ్యంతరాలు ఉంటే తేది.19న (మంగళవారం) నాటికి అభ్యంతరాలను రాతపూర్వకంగా తగు ఆధారాలతో సమగ్ర శిక్షా కార్యాలయానికి అందజేస్తే తదుపరి మీ అభ్యంతరాలను పరిశీలించి, తుది సీనియర్ లిస్టులో సరి చేయబడుతుందని తెలిపారు.

మొక్కుబడిగా మండల సమావేశం

ప్రజాశక్తి-పెదబయలు : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి బొండా వరహాలమ్మ అధ్యక్షతన బుధవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగా జరిగింది. మూడు నెలలకు ఒకసార జరిగిన ఈ సమావేశానికి వివిధ శాఖల అధికారులు డుమ్మా కొట్టారు. అభివృద్ధి పనులపై సమాధానాలు చెప్పవలసి వస్తుందని సంబంధిత అధికారులు సమావేశానికి హాజరు కాలేదని ప్రజాప్రతినిధులు మండిపడ్డారు. జిసిసి, రహదారులు, పాఠశాలల మరమ్మతులపై తూతూ మంత్రంగా చర్చ జరిగింది. ఈ సమావేశంలో ఎంపిడిఒ ఎల్.పూర్ణయ్య, ఈవోపిఆర్‌డి నరసింగరావు, పలువురు సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, అధికారులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం


పుస్తకాలను చూపుతున్న ప్రిన్సిపల్, సిబ్బంది

ప్రజాశక్తి-అరకులోయ:స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గ్రంథాలయ దినోత్సవాన్ని పురస్కరిం చుకొని స్థానిక మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పట్టాసి చలపతిరావు ఆధ్వర్యంలో డిపార్ట్మెంట్ ఆఫ్ లైబ్రరీ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, విద్యార్థులందరూ సెల్ఫోన్లకు దూరంగా ఉండి పుస్తకాలను చదువుతూ జ్ఞానాన్ని పెంచుకోవాలని ఆయన తెలిపారు. నిరంతరం పుస్తక పఠనంతోనే మంచి జ్ఞానం వస్తుందన్నారు. అవసరంలేని విషయాలు సెల్ఫోన్‌లో వీక్షించడంతో కంటి సమస్యలు అధికమవుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ ఇంచార్జ్ డాక్టర్ సుభాన్, బడ్నాయక్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో అధ్యాపకుల నిరసన

ప్రజాశక్తి -భీమునిపట్నం : తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కొద్దిరోజులుగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి భోజన విరామ సమయంలో చేపడుతున్న నిరసన బుధావరం ఐదోరోజు కూడా కొనసాగింది. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో బదిలీలను వెంటనే చేపట్టాలని, జిఒ 42 రద్దు చేయాలని, ఐఆర్ ప్రకటించాలని, డిగ్రీ కళాశాలల్లో ఖాళీగా ఉన్న ప్రిన్సిపల్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 18న విజయవాడ ధర్నా చౌక్ వద్ద ధర్నాను జయప్రదం చేయాలని జిసిజిటిఎ జిల్లా అధ్యక్షులు విష్ణుమూర్తి పిలుపునిచ్చారు.

టిడిపి కార్యకర్త కుటుంబానికి ఆర్థికసాయం


నగదు అందిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి - మారేడుమిల్లి: మారేడుమిల్లి మండలం డివి కోట పంచాయతీకి చెందిన టిడిపి సీనియర్ నాయకులు బట్ట లచ్చిరెడ్డి అనారోగ్యంతో బుధవారం మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మిరియాల శిరీష, విజయ భాస్కర్ మారేడుమిల్లి మండల కమిటి నాయకులతో మాట్లాడి లచ్చిరెడ్డి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియపరుస్తూ విలీన మండలాల్లో మండల కమిటీ ఎన్నికలు ఉన్నందువలన రాలేకపోతున్నామని వచ్చిన తర్వాత వారి కుటుంబాన్ని పరామర్శిస్తామని ఎమ్మెల్యే తెలిపారని చెప్పారు. వారి కుటుంబానికి అంత్యక్రియల నిమిత్తం రూ.10వేలు అంద జేయమన్నట్టు ఎమ్మెల్యే తెలిపారని ఈ సందర్భంగా వారికి నగదు అందజేశారు. టిఎన్ఎస్ ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ రాజ్‌కుమార్‌రెడ్డి పల్లాల, పార్టీ మండల అధ్యక్షులు గురుకు శేషుకుమార్ తదితరులు ఉన్నారు.

పిఎం కిసాన్, అన్నదాత సుఖీభవ వర్తింపచేయాలి

ప్రజాశక్తి-కూనవరం: బొజ్జరాయిగూడెంలో సీనియర్ నాయకులు నానుపల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. రేగులపాడు పంచాయతీ సర్పంచ్ బొగ్గ రామారావు మాట్లాడుతూ బొజ్జరాయిగూడెం కూనవరం మండలంలోనే పోలవరం నిర్వాసిత మొదటి ప్రాధాన్య గ్రామం వీరికి ఎటపాక మండలంలోని రాయన్నపేటలో నిర్వాసిత కాలనీ ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికీ వీరికి పూర్తిస్థాయిలో కాలనీ నిర్మాణం పూర్తి కాలేదు. అదేవిధంగా భూమికి భూమి ఇవ్వాల్సిన రైతులకు వ్యవసాయానికి నోచుకోని భూమిని ప్రభుత్వం చూపించిందని మండిపడ్డారు. ఇంతవరకూ రాయణపేట పరిసరాల్లో ఇచ్చిన భూమికి వారి పేరు మీద వెబ్ ల్యాండ్ నందు నమోదు చేయలేదని ఎక్కడా వీరిపేర్లు లేవని దీంతో వీరికి పిఎం కిసాన్ పథకం, అన్నదాత సుఖీభవ పథకం వర్తించడం లేదన్నారు. కూనవరం, యాటపాక రెవిన్యూ అధికారులు స్పందించి పథకాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు పాంద్రు రామయ్య, మండల కమిటీ సభ్యులు బొగ్గా సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



స్టడీమెటీరియల్, దుస్తులు పంపిణీ చేస్తున్న ఎస్సై రవీంద్ర

గంజాయి జోలికి వెళ్లొద్దు

ప్రజాశక్తి-సీలేరు: గంజాయి జోలికి వెళ్లి యువత జీవితాలు పాడు చేసుకోవద్దని ఎస్సై కె.రవీంద్ర సూచించారు. జికె వీధి మండలం దారకొండ పంచాయతీ నరమామిడిగొంది గ్రామాన్ని బుధవారం పోలీసులు సందర్శించారు. అనంతరం గ్రామస్తులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ గంజాయి రవాణా చేయడం చట్టరీత్యా నేరమని యువత ఉన్నత చదువులు చదివి కుటుంబానికి చేదోడుగా నిలవాలని సూచించారు. అదేవిధంగా హెల్మెట్ లేకుండా వాహనాలు నడపకూడదని పేర్కొన్నారు. విద్యార్థులకు స్టడీ మెటీరియల్, దుస్తులు క్రీడాకారులకు వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు.

దోమల మందు పిచికారీ చేయించాలి

ప్రజాశక్తి- రంపచోడవరం : మండలం ముసురుమిల్లి పంచాయతీ పెద్ద భారంగిలో దోమల మందు పిచికారిని సర్పంచ్ కోసురమేష్ బాబు, ఎంపిటిసి సభ్యులు వంశి కుంజం బుధవారం పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఇంటిలో దోమల మందు పిచికారి చేసుకోవాలని సూచించారు. అనంతరం స్కూల్,అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించి పిల్లలతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు బొబ్బా శేఖర్, వెల్ఫేర్ అస్సిటెంట్ బాపన్నమ్మ, మహిళ పోలీస్ కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.